## ప్రజావాణికి మూడు ఫిర్యాదులు



ప్రజావాణిలో పాల్గొన్న జీహెచ్ఎంసీ కమిషనర్ రవికుమార్,ఏసీపీ శ్రీధర్‌లు

బండ్లగూడ,జూన్ 23: రాజేంద్రనగన్ సర్కిల్ పరిధిలో ఉన్న సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నామని డిప్యూటీ కమిషనర్ రవికుమార్ పేర్కొన్నారు. సోమవారం రాజేంద్రనగర్ జీహెచ్ఎంసీ కార్యాలయంలో రవికుమార్ అధ్యక్షతన ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ దీపాలు,రోడ్లకు మరమ్మతులు, ఇంటి అసెస్మెంట్‌ల గురించి మూడు ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు.వాటిని సంబంధింత అధికారులకు అందజేశామని వాటిని వెంటనే పరిష్కరించాలని ఆదేశించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీధర్ తదితరులు ఉన్నారు.

## మోకిలా ఎథ్నిక్ రన్ విజయవంతం




సిటీ బ్యూరో, జూన్ 23 (నమస్తే తెలంగాణ): పర్యావరణ పరిరక్షణ కోసం జీరో వేస్ట్ లక్ష్యంగా పనిచేస్తున్న గండిపేట వెల్ఫేర్ సొసైటీ చేపట్టిన మోకిలా ఎథ్నిక్ రన్-2025 విజయవంతమైందని సొసైటీ సభ్యురాలు తిమ్మయ్యగారి వాణి తెలిపారు. సొసైటీ వ్యవస్థాపకురాలు రాజశ్రీ పిన్నమనేని ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు.
ప్రస్తుతం గండిపేట వెల్ఫేర్ సొసైటీ ఏడు ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాలను నడుపుతున్నట్లు పేర్కొన్నారు. చెరువుల శుభ్రత, బావుల పునరుద్ధరణ పనులు చేపడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద, మారకంటి భవానీ, వెన్నెల గద్దర్, విశాలరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# తప్పని 'పట్టణ' ఆరోగ్య కష్టాలు

– కమ్యూనిటీహాల్‌లోకి తరలించాలన్న ప్రతిపాదనలు

– ఉన్నతాధికారులకు లేఖలు రాసినా స్పందించని అధికారులు

బంజారాహిల్స్,జూన్ 23: జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని జవహర్ కాలనీలోని పట్టణ ఆరోగ్య కేంద్రంలో రోగుల కష్టాలు కొనసాగుతున్నాయి. ఏడాది కాలంగా పట్టణ ఆరోగ్య కేంద్రానికి సంబంధించిన పెండింగ్ ఇంటి అద్దె బకాయి చెల్లించకపోవడంతో రోగులు పడుతున్న ఇక్కట్లపై మూడురోజుల క్రితం నమస్తే తెలంగాణ పత్రికలో 'పట్టణ ఆరోగ్యానికి కష్టాలు' పేరుతో కథనం ప్రచురించిన సంగతి తెలిసిందే. ఈ వ్యవహారంలో మరింత లోతుగా విచారణ చేపట్టగా అనేక విషయాలు బయటకు వచ్చాయి. సుమారు ఆరు నెలలుగా పట్టణ ఆరోగ్య కేంద్రం వ్యవహారంపై స్థానిక సిబ్బంది వైద్యశాఖ ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు పదుల సంఖ్యలో ఫిర్యాదులు చేసినట్లు తెలిసింది. పట్టణ ఆరోగ్య కేంద్రం కొనసాగుతున్న ఇంటి యజమాని అద్దె కోసం పెడుతున్న ఇబ్బందులను జిల్లా వైద్యాధికారి డా.వెంకటితో పాటు జిల్లా కలెక్టర్ దృష్టికి సైతం తీసుకువెళ్లారు. అయితే అద్దె బకాయిలు విడుదల చేయించాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తడంతో పాటు ఆరోగ్య కేంద్రాన్ని నిర్వీర్యం చేసేందుకు మౌఖిక అదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. దీనిలో భాగంగా అక్కడ పనిచేస్తున్న సిబ్బందిని సమీపంలోని ఇందిరానగర్ బస్తీ దవాఖానకు, వెంకటేశ్వర కాలనీ డివిజన్ పరిధిలోని షౌకత్‌నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రానికి తరలించే ప్రయత్నాలు చేస్తున్నట్లు తేలింది.




ఖాళీగా ఉన్న జవహర్ కాలనీలోని జీహెచ్ఎంసీ కమ్యూనిటీహాల్

### కమ్యూనిటీహాల్‌లోకి తరలించండి..

ఇదిలా ఉండగా నిత్యం సుమారు 100నుంచి 150మంది వరకు ఉచిత వైద్యాన్ని అందిస్తున్న పట్టణ ఆరోగ్య కేంద్రం అద్దె భవనం నుంచి సమీపంలోని జవహర్ కాలనీ కమ్యూనిటీహాల్‌లోకి మార్చాలంటూ జిల్లా వైద్యాధికారి ఈనెల 13న జీహెచ్ఎంసీ సెంట్రల్ జోన్ కమిషన్‌కు లేఖ రాశారు. జీహెచ్ఎంసీ నిధులతో నిర్మించిన ఈ కమ్యూనిటీ హాల్ ఏడాదిలో కొన్నిరోజులు తప్ప మిగిలిన రోజులు ఖాళీగానే ఉంటుందని, ప్రజలకు ఉపయోగపడే పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని తాత్కాలికంగా దీనిలోకి మార్చేందుకు చర్యలు తీసుకోవాలని జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్‌తో పాటు స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ సైతం జీహెచ్ఎంసీ అధికారులకు లేఖలు రాసినా ఇప్పటివరకు స్పందన లభించలేదు. కొంతమంది బస్తీనేతల ఒత్తిడితోనే పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని కమ్యూనిటీహాల్‌లోకి తరలించే విషయంలో జీహెచ్ఎంసీ అధికారులు చొరవ చూపించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.
బస్తీవాసులకు ఉపయోగపడే పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని తాత్కాలికంగా కమ్యూనిటీహాల్‌లోకి తరలించినా తమకు అభ్యంతరం లేదని కమ్యూనిటీహాల్‌లో సమావేశాలు పెట్టుకునే మహిళా సమాఖ్య నేతలు సైతం కలెక్టర్‌కు, జీహెచ్ఎంసీ అధికారులకు లేఖ రాశారు.

### పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం

జీహెచ్ఎంసీ సర్కిల్ –18 డీఎంసీ

జవహర్ కాలనీలోని పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని జీహెచ్ఎంసీకి చెందిన కమ్యూనిటీహాల్‌లోకి తరలించాలన్న ప్రతిపాదనలు వచ్చాయి. స్థానిక ఎమ్మెల్యేతో పాటు స్థానిక కార్పొరేటర్ తరపునుంచి లేఖలు వచ్చాయి. ఈ సమస్యను పరిష్కరించేందుకు మావైపునుంచి అవసరమైన అన్ని చర్యలు త్వరలో తీసుకుంటాం.

## దళితులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



హిమాయత్‌నగర్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న అనిల్ కుమార్

హిమాయత్ నగర్,జూన్ 23: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ దళితులకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు చర్యలు చేపట్టాలని తెలంగాణ దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు కె.యేసురత్నం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం హిమాయత్‌నగర్‌లో డీహెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని దళితుల సంక్షేమం కోసం ఉన్న సంక్షేమ పథకాలను పూర్తిగా నిలిపివేయడంతో పాటు ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను నిర్వీర్యం చేయడం జరిగిందని విమర్శించారు.అర్హులైన దళిత నిరుద్యోగ యువతకు సబ్సిడీ రుణాలను తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో డీహెచ్ పీఎస్ రాష్ట్ర నేతలు ఆరుట్ల రాజు కుమార్, జె.కుమార్ స్వామి, కె.సహదేవ్, ఉషశ్రీ, టి.రామకృష్ణ, రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.

### 30 నుంచి సెల్ట్ తరగతులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలోని సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ ట్రైనింగ్ (సెల్ట్)లో ఈ నెల 30వ తేదీ నుంచి తరగతులను నిర్వహించనున్నట్లు సెల్ట్ డైరెక్టర్ ప్రొఫెసర్ సవిన్ సౌడ ఒక ప్రకటనలో తెలిపారు.




### న్యాయం మరింత చేరువ చేయడమే మా లక్ష్యం : సోమిరెడ్డి

కోకాపేటలో సోమిరెడ్డి లా గ్రూప్ కొత్త కార్యాలయం ప్రారంభించారు. అత్యాధునిక సౌకర్యాలతో కార్పొరేట్, రియల్ ఎస్టేట్, కుటుంబ, సివిల్, క్రిమినల్ వివాదాలకు సంబంధించిన సేవలను అందిస్తున్నాం అని సోమిరెడ్డి సంతోష్ రెడ్డి తెలిపారు. ముఖ్య అతిథులుగా భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు తదితరులు ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.

## అర్హులైన పేదలకు తెల్లరేషన్ కార్డులు ఇవ్వాలి




ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు, కార్యకర్తలు

ఖైరతాబాద్, జూన్ 23 : గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో అర్హులైన పేదలందరికీ తెల్ల రేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం పంజాగుట్ట ఎర్రమంజిల్‌లోని సివిల్ సప్లై కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సీపీఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం. వెంకటేశ్ మాట్లాడుతూ కొత్త రేషన్ కార్డుల కోసం గ్రేటర్‌లోని పేదలు దరఖాస్తులు చేసుకున్నారని, కాని వాటి విచారణలో సివిల్ సప్లై అధికారులు ఆలస్యం చేస్తుండడం వల్ల అర్హులైన లక్షలాది మంది లబ్ధిదారులు రేషన్ కార్డు కోసం ఎదురు చూస్తూ నిరాశ చెందుతున్నారన్నారు. అనంతరం సివిల్ సప్లై డిప్యూటీ కమిషనర్ చంద్రప్రకాశ్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు ఎం. శ్రీనివాస్, కేవన్ రాజన్న, కె. నాగలక్ష్మి, ఎం. దశరథ్, ఎం. మహేందర్, పద్మ, వరలక్ష్మి, జి. కిరణ్ తదితరులు పాల్గొన్నారు.




యూసుఫ్‌గూడ సర్కిల్ డిప్యూటీ మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ దేదీప్య తదితరులు

## నోటరీ ఇళ్ల జోలికి పోకండి

వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య

వెంగళరావునగర్, జూన్ 23 : నోటరీ ఇండ్ల జోలికి పోవొద్దని..పేదల ఇళ్ళు కూల్చొద్దని వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య బల్దియా అధికారులను కోరారు. సోమవారం యూసుఫ్ గూడ లోని జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ జకీయా సుల్తానాకు దేదీప్య వినతిపత్రం సమర్పించారు. వెలగని వీధి దీపాలతో జనం అవస్థలు పడ్తున్నారని..తక్షణమే విద్యుత్‌దీపాలు ఏర్పాట్లు చేయాలని కోరారు. పెండింగ్‌లో రోడ్ల పనులు చేపట్టాలని.. పార్కుల అభివృద్ధికి చొరవ చూపాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.




## నూతన పాలక మండలి కోసం నోటిఫికేషన్

చైర్మన్ పదవిని దక్కించుకునేందుకు మంత్రుల వద్దకు క్యూ

కబ్జా కోరులకు ఇవ్వవద్దని స్థానికుల విజ్ఞప్తి



అనంత పద్మనాభ స్వామి దేవాలయం

బండ్లగూడ,జూన్ 23 : అత్తాపూర్‌లో అత్యంత ప్రాచీనమైన అనంత పద్మనాభ స్వామి దేవాలయం అభివృద్ధికి దేవాదాయ శాఖ వారు చర్యలు ప్రారంభించింది. అందుకు సంబంధించి దేవాలయ అభివృద్ధి కోసం పాలక మండలి నియామకం కోసం నోటిఫికేషన్ జారీ చేసింది.ఇదిలా ఉంటే అనంత పద్మనాభ స్వామి దేవాలయం చైర్మన్ పదవిని దక్కించుకోవాలని స్థానిక నాయకులు ఆరటపడుతున్నారు.చైర్మన్ పదవిని ఎలాగైనా దక్కించుకోవాలనే లక్ష్యంతో నాయకులు పావులు కదుపుతున్నారు.ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యేతో పాటు మంత్రి, సీఎం చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నట్లు సమాచారం.దేవాలయం అనేక ఏండ్లుగా దేవాదాయ శాఖ ఆధీనంలో ఉండటంతో వారు దేవాలయం అభివృద్ధి చేయలనే లక్ష్యంతో పాలక మండలి ఏర్పాటు కోసం ప్రయత్నాలు చేసింది.దీనిని అక్కడి అర్చకులు అడ్డుకుంటూ వచ్చారు. ఇటీవల మరోసారి దేవాదాయ శాఖ వారు అర్చకుల సహకారంతో మరోసారి నోటిఫికేషన్ ఇవ్వడంతో పాటు నూతన పాలక మండలి కోసం దరఖాస్తులను ఆహ్వానించారు.అయితే మెదటి సారిగా అనంత పద్మనాభస్వామి దేవాలయం పాలక మండలి నోటిఫికేషన్ రావడంతో స్థానిక నాయకులు చైర్మన్ పదవిని దక్కించుకునేందుకు స్థానికులతో పాటు స్థానికేతరులు అనేక మంది దరఖాస్తు చేసుకున్నారు.కాగా పాలక మండలి చైర్మన్ దక్కించుకునేందుకు కొంత మంది గతంలో దేవాలయ భూములను కబ్జాలు చేసి అందులో ఇండ్లు నిర్మించుకుని వ్యాపారాలు చేస్తున్న వారు కూడా దరఖాస్తు చేసుకున్నారని స్థానిక ప్రజల నుంచి అరోపణలు వినిపిస్తున్నాయి.అలాంటి వారికి పదవులు ఇవ్వకూడదని అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

## సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలి



ఉచిత వైద్య శిబిరంలో పాల్గొన్న అగర్వాల్ సేవా దళ్ సభ్యులు

మైలార్‌దేవ్‌పల్లి: సేవా కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములవుతూ పేదలకు అండగా నిలవాలని మనీష్ అగర్వాల్ అ న్నారు. బద్రీ విశాల్ పన్నాలాల్ పిట్టి ట్రస్ట్, అగర్వాల్ సేవా దళ్ ఆధ్వర్యంలో సోమవారం అత్తాపూర్‌లోని ఓ స్కూల్‌లో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 411 మంది పేదలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. ఈ సందర్భంగా మనీష్ అగర్వాల్ మాట్లాడుతూ ఉచితంగా రోగులకు బెడ్స్, వాకర్స్, ఆక్సిజన్ సిలిండర్ ఎయిర్ బెడ్, బ్యాక్ సపోర్ట్ స్టాండ్స్, ఆక్సిజన్ , మహవీర్ ఆసుపత్రిలో ఉచితంగా డయాలసిస్ తదితర సౌకర్యాలను అందిస్తున్నామన్నారు. అవసరం ఉన్న వారు తమను సంప్రదిస్తే ఉచితంగా అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అగర్వాల్ సేవా దళ్ సభ్యులు, డాక్టర్లు, ప్రజలు పాల్గొన్నారు.

## నిరుద్యోగులకు ఉచితంగా డేటా ఇంజినీరింగ్ కోర్సు

ఖైరతాబాద్ : శ్రీ సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు ఉచితంగా డేటా ఇంజినీరింగ్ కోర్సులో శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శ్రీ సత్యసాయి స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా ఈ శిక్షణ ఇస్తున్నామని, 2022–2025 మధ్యలో బీఎస్సీ, ఎమ్మెస్సీ, బీటెక్, ఎంటెక్, ఎంసీఏ పూర్తి చేసిన పట్టభద్రులు అర్హులని చెప్పారు. ఎంపికైన అభ్యర్థులకు బేసిక్స్, అడ్వాన్స్‌డ్ పైథాన్, ఎస్క్యూఎల్, బీఐ టూల్స్‌తో పాటు సాఫ్ట్ స్కిల్స్‌లో 90రోజుల పాటు శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి కలిగిన వారు www.sethu.aiలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని, వివరాలకు 9052372023 నంబరులో సంప్రదించాలన్నారు.

### పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

బంజారాహిల్స్,జూన్ 23: ఇంటి ఆవరణలో నీళ్లు నిల్వలేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోకపోతే డెంగీతో పాటు ఇతర వ్యాధులు వచ్చే అవకాశం ఉందని జీహెచ్ఎంసీ సర్కిల్–18 డిప్యూటీ మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య అన్నారు. వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని పంజాగుట్ట ప్రతాప్‌నగర్, నాగార్జున హిల్స్ తదితర ప్రాంతాల్లో సోమవారం ఎంటమాలజీ విభాగం ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నీటిలో లార్వా ఆనవాళ్లను పరిశీలించారు.



పంజాగుట్టలో పరిసరాలను పరిశీలిస్తున్న ఎంటమాలజిస్టు సిబ్బంది

### ఉద్యోగ సంఘాల గుర్తింపు ఎన్నికలు నిర్వహించండి



ఎండీ అశోక్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న రాజిరెడ్డి

ఖైరతాబాద్, జూన్ 23 : హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ అండ్ సీవరేజీ బోర్డులో చట్టం ప్రకారం ఉద్యోగ సంఘాల గుర్తింపు ఎన్నికలు నిర్వహించాలని జలమండలి కామ్‌గార్ యూనియన్ అధ్యక్షుడు మొగుళ్ల రాజిరెడ్డి కోరారు. ఈ మేరకు సోమవారం జలమండలి మేనేజింగ్ డైరెక్టర్ అశోక్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. రామరాజు, అసోసియేట్ ప్రెసిడెంట్ బి. భూమయ్య, కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

### డీఎస్సీ-2024 స్పోర్ట్స్ కోటాలో అవకతవకలు

స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా

ఖైరతాబాద్, జూన్ 23: డీఎస్సీ-2024 స్పోర్ట్స్ కోట ఉద్యోగాల భర్తీలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ అభ్యర్థులు లక్డీకపూల్‌లోని స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అభ్యర్థులు శ్రీనివాస్, లక్ష్మణ్, రాజేష్, కవిత మాట్లాడుతూ.. ఈ ఉద్యోగ భర్తీలో అనేక అవకతకులు జరిగాయని, అంతర్జాతీయ, జాతీయ క్రీడాకారులను పక్కనపెట్టి.. రాష్ట్రస్థాయి క్రీడాకారులకు ఉద్యోగాలు కల్పించారని ఆరోపించారు. ఈ విషయంపై అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వారం రోజుల్లో సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేసి అర్హులైన వారికి ఉద్యోగాలు కేటాయించాలని, లేనిపక్షంలో ఆమరణ దీక్ష చేస్తామని హెచ్చరించారు.

## విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

ఖైరతాబాద్: ఫీజు నియంత్రణ చట్టాన్ని తెచ్చి, విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలని, పాఠశాలలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో లకిడికాపూల్ లోని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆఫీస్ ముందు ధర్నా నిర్వహించారు. ఆ సంఘం జాతీయ నాయకులు పి.మహేష్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.వి.శ్రీకాంత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక వసతులు కల్పించడం లేదన్నారు. చాలా పాఠశాలలకు ఇప్పటికీ తాగునీరు, టాయిలెట్స్, వంట షెడ్లు, ప్రహరీ గోడలు నిర్మాణం లేవన్నారు. పాఠశాలలో యుద్ధ ప్రాతిపదిక సౌకర్యాలు కల్పించాలని, శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలను గుర్తించి వెంటనే వాటికి కొత్త భవనాలను నిర్మించాలన్నారు. విద్య హక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేసి కార్పొరేటు, ప్రైవేట్ పాఠశాలల్లో 25 శాతం పేద విద్యార్థులకు ఉచితంగా అడ్మిషన్లు కేటాయింపు జరిగేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు బోనగిరి మధు, జన్నారపు రాజేశ్వర్, డి.శ్రీకాంత్, మంద నవీన్. రాష్ట్ర సహాయ కార్యదర్శులు గోకనపల్లి మస్తాన్, కే.శ్రీనివాస్, తీగల శ్యామ్,ఝాన్సీ, సందీప్, పి.సింహాద్రి, గణేష్, ఎం.మహేష్, యశ్వంత్, రహీం, భరత్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆఫీస్ ఎదుట ధర్నా చేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు, కార్యకర్తలు

# విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న స్టేట్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ చైర్‌పర్సన్ సీతాదయాకర్‌రెడ్డి

మణికొండ, జూన్ 23: విద్యార్థులు చదువుకునేందుకు అవకాశాలు కల్పిస్తూ వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయడం హర్షనీయమని స్టేట్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ చైర్‌పర్సన్ సీతాదయాకర్‌రెడ్డి అన్నారు. ఎస్ఓఎస్ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ హెర్మన్ మైనర్ 106వ జయంతి సందర్భంగా ఎస్ఓఎస్ డే వేడుకలను ఎస్ఓఎస్ బాలల గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సీతాదయాకర్‌రెడ్డి పాల్గొని మాట్లాడుతూ బాలలను ఒక కుటుంబ వాతావరణంలో పెంచడం హర్షనీయమన్నారు. వారి అభివృద్ధిలో తల్లుల పాత్ర చాలా ప్రాముఖ్యమన్నారు. పిలలకు ఎస్ఓఎస్ సంస్థ అందిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకొని పిల్లలు ఉన్నతమైన స్థానంలో ఉండాలని సూచించారు. చైల్డ్ వెల్ఫేర్ కమిటీ రంగారెడ్డి జిల్లా నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్ఓఎస్ సంస్థ చేస్తున్న వివిధ కార్యక్రమాల గురించి వివరించారు. రంగారెడ్డి జిల్లాలో ఉన్న బాలల సంరక్షణ హోమ్‌లలో ఎస్ఓఎస్ సంస్థ గత కొన్ని సంవత్సరాల నుంచి బాలల సంరక్షణలో మొదటి స్థానంలో ఉందన్నారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఉన్నత విద్యలో ప్రతిభకనబరిచిన విద్యార్థులను వారు అభినందిస్తూ బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ కోటేష్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ రంగారెడ్డి జిల్లా సభ్యులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

### సాఫ్ట్ వేర్ ఉద్యోగి ఆత్మహత్య

వెంగళరావునగర్ : సాఫ్ట్ వేర్ ఉద్యోగి ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడిన ఘటన మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎల్లారెడ్డిగూడలో చోటుచేసుకుంది.పోలీసుల కథనం ప్రకారం తూర్పు గోదావరి ఆత్రేయపురం మండలానికి చెందిన కాయల అనిల్ కుమార్(28) సాఫ్ట్ వేర్ ఉద్యోగి. ఎల్లారెడ్డిగూడలోని రూమ్‌లో తన స్నేహితులతో కలిసి నివాసం ఉంటున్నాడు. కాగా సోమవారం తెల్లవారుజాముల గదిలో అనిల్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఉదయం లేచి చూసిన తోటి స్నేహితులు మధురానగర్ పోలీసులకు ఫి ర్యాదు చేశారు. ఈ మేరకు మధురానగర్ పో లీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు

### పార్కింగ్ చేసిన ట్రాక్టర్ చోరీ

వెంగళరావునగర్, జూన్ 23 :పార్కింగ్ చేసిన ట్రాక్టర్‌ను దొంగలు అపహరించుకెళ్లిన ఘటన ఎస్.ఆర్.నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బి.కె.గూడలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం సనత్‌నగర్‌కు చెందిన పిల్లి లక్ష్మయ్య ఇటీవల సెకండ్ హ్యాండ్ ట్రాక్టర్ కొనుగోలు చేశారు. ఈ ట్రాక్టర్‌పై శ్రీరాములు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. శనివారం సాయంత్రం ఈ.ఎస్.ఐ. ఆసుపత్రి గల్లీల్లో ట్రాక్టర్‌ను పార్కింగ్ చేశాడు. ఆదివారం ఉదయం వెళ్లి చూస్తే అక్కడ ట్రాక్టర్ కనిపించలేదు. అన్నిచోట్లా వెతికినా ట్రాక్టర్ జాడ లభ్యం కాకపోవడంతో ట్రాక్టర్ యజమాని లక్ష్మయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్.ఆర్.నగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఆపరేషన్ కగార్‌ను ఆపండి

ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రాజ్ భవన్ ముట్టడి

పలువురు నేతల అరెస్టు


ఖైరతాబాద్, జూన్ 23: కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో చేస్తున్న హత్యాకాండను తక్షణమే ఆపాలని డిమాండ్ చేస్తూ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం రాజ్ భవన్ ముట్టడికి యత్నించారు. ఖైరతాబాద్ చౌరస్తా మీదుగా రాజ్ భవన్ వైపునకు భారీ ర్యాలీతో వెళ్తున్న ఏఐవైఎఫ్ నాయకులు, కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఇరువురి మధ్య తోపులాటలు చోటు చేసుకున్నాయి. ఈ క్రమంలో పలువరు ఏఐవైఎఫ్ నేతలకు గాయాలయ్యాయి. ఆందోళన చేస్తున్న వారిని పోలీసులు వాహనాల్లో పంజాగుట్ట స్టేషన్ కు తరలించారు. ఆపరేషన్ కగార్ పేరుతో సహజ వనరుల దోపిడీకి కేంద్ర ప్రభుత్వం యత్నిస్తుందని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వలీ ఉల్లా ఖాద్రి, కల్లూరు ధర్మేంద్రలు ఆరోపించారు. మావోయిస్టులతో పాటు అమాయక ఆదివాసీ గిరిజనులను హత్య చేస్తున్నారన్నారు. నక్సల్స్ ను నిర్మూలించడం కోసమే ఆపరేషన్ కగార్ అని చెబుతున్న కేంద్రం, ఆదివాసీలను వారి గూడాల నుంచి ఎందుకు వెళ్లగొడుతున్నారో సమాధానం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ బిజ్జ శ్రీనివాసులు, టి. సత్య ప్రసాద్, పేరబోయిన మహేందర్, శ్రీమాన్, చేపూరి కొండల్, ఆర్. బాలకృష్ణ, చిలుక రాజ్ శ్రీను, సల్మాన్ బేగ్, శివకుమార్, మహమూద్ మాజీద్, వెంకటేశ్, సురేశ్, మధు, మధుకర్, శోభన్, వీరన్న, నాగేశ్వర్ రావు



నారాయణగూడ పోలీస్ స్టేషన్ ఆవరణంలో మొక్కలను నాటు తున్న సీఐ చంద్రశేఖర్

### పచ్చదనం, పరిశుభ్రతతోనే.. సంపూర్ణ ఆరోగ్యం

హిమాయత్ నగర్ ,జూన్23: పచ్చదనం, పరిశుభ్రత ఉంటేనే ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యంగా జీవించవచ్చని నారాయణగూడ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ యు. చంద్రశేఖర్ తెలిపారు. మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ వారోత్సవాల సందర్భంగా సోమవారం నారాయణగూడలోని పీఎస్ ఆవరణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత మత్తుకు బానిసై ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. భావి తరాలకు మంచి పర్యావరణం కోసం మొక్కలను నాటి వాటిని పెంచే బాధ్యత అందరిపై ఉందన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్సైలు షఫీ, నాగరాజుతో పాటు పీస్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



సుల్తాన్‌పల్లి గ్రామంలో మొక్కలు నాటుతున్న దృశ్యం

### మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి

శంషాబాద్ రూరల్: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని బీజేపీ నాయకులు తెలిపారు. శంషాబాద్ మండలంలోని సుల్తాన్‌పల్లి గ్రామంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి నర్సింగ్‌ముదిరాజ్, బూత్ అధ్యక్షుడు అరుణ్‌రెడ్డి, శ్రీకాంత్‌గౌడ్, శివశంకర్,పవన్, ప్రవీణ్, అరుణ్, పవన్,బల్వంత్‌రెడ్డిలతో పాటు పలువురు పాల్గొన్నారు.